క్లుప్తంగా

రేపు జాబ్ మేళా

గోవిందరావుపేట: జిల్లా యువతి, యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 19న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ములుగు మండలంలోని ఇంచేర్ల గ్రామంలో ఉన్న ఎంఆర్ గార్డెన్‌లో 58 కంపెనీలు కలిసి నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 7వ తరగతి నుంచి డిగ్రీతో పాటు వృత్తి విద్య కోర్సులు చేసిన వారికి వారి అర్హతను బట్టి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాల్లో చేర్చుకోవడం జరుగుతుందని తెలిపారు.

నివాళి



గోవిందరావుపేట: మండల కేంద్రానికి చెందిన కాకినాడ ప్రసాద్ తల్లి పద్మావతి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సోమవారం వేర్వేరుగా హాజరైయ్యారు. పద్మావతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు వెంకటకృష్ణ, జిల్లా నాయకులు సూరపనేని నాగేశ్వరరావు, జెట్టి సోమయ్య, నాగేందర్, అనిల్, చంద్రశేఖర్, సుదాకర్, సతీష్ రెడ్డి, వెంకటేష్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



మంగపేట: మండలంలోని కమలాపురంలోని బాధిత కుటుంబాలను యువజన కాంగ్రెస్ రాష్ట్ర సెక్రటరి, మంతి సీతక్క తనయుడు సూర్య పరామర్శించారు. గ్రామానికి చెందిన కట్ల కొమరయ్య గత కొంత కాలంగా కేన్సర్‌తో బాధపడుతుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని రూ.2,000 నగదు, 50 కేజీల బియ్యం అందజేశారు. అనంతరం అదే గ్రామంలో ఇటీవల పాముకాటుతో మృతి చెందిన గందాల రాణి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే వడ్డెరకాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వేముల సమ్మయ్య కాలువిరిగి ఇంటివద్ద వైద్యం పొందుతుండగా ఆయనను పరామర్శించారు. పున్నారావు, భగవాన్‌రెడ్డి, వేమారవి, బట్టర్‌శెట్టి గౌతమ్, అశోక్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ



ఏటూరునాగారం: రాష్ట్ర స్థాయిలో మెడల్స్ గెలుపొందిన ఏటూరునాగారం క్రీడాకారులకు సోమవారం సీఐ రాజు స్పోర్ట్స్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. గతంలో క్రీడాకారులకు ఇచ్చిన మాట ప్రకారం బదిలీపై వెళ్తున్న క్రమంలో మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో నూతన సీఐ శ్రీనివాస్, సిబ్బంది పర్వతాల కుమార స్వామి, తదితరులు ఉన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



మంగపేట: కమలాపురంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వెంకటాపురం(ఎం): మండలంలో బక్రీద్‌ను ముస్లింలు నిర్వహించుకున్నారు. సోమవారం ఉదయం ఆయా గ్రామాల సమీపంలోని ఈద్గా వద్దకు చేరుకొని ప్రార్థనలు చేశారు. ఒకరికొకరూ అలాయ్ బలాయ్ తీసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వెంకటాపురం ఎస్సై చల్లా రాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వెంకటాపురం(కె): వెంకటాపురం మండలంలో బక్రీద్‌ను సోమవారం ముస్లింలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డు ఆవరణంలో నమాజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, తాజుద్దీన్, బాషా, మస్తాన్ తదితరులు ఉన్నారు.

ఏటూరునాగారం: మండలంలో బక్రీద్ సందర్భంగా ముస్లింలు నమాజ్ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో అయుబ్, రఘు, సలీమ్, ఖాజా, ఖలిల్, తదితరులు ఉన్నారు.

మంగపేట: మండల వ్యాప్తంగా బక్రీద్‌ను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని మంగపేట, కమలాపురం, రాజుపేట, పూరేడుపల్లి, దోమెడ తదితర గ్రామాల్లో ముస్లింలు ఉదయాన్నే సమీప మసీదులు, ఈద్గాల వద్దకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు పండుగ సందేశాన్ని వినిపించారు. పేద వారికి సాయం చేయడం వలన శుభాలు కలుగుతాయని బక్రీద్ పండుగ ప్రత్యేకతను మత గురువులు చదివి ముస్లింలకు చదివి వినిపించారు. అనంతరం చిన్నా పెద్దా తేడా లేకుండా అందరు కలిసి ఒకరినొకరూ పండుగ శుభాకాంక్షలను తెలుపుకున్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా కుల మత సామరస్యానికి ప్రతీకగా కొందరు ముస్లింలు హిందువులైన స్నేహితులు, ప్రజా ప్రతి నిధులు రాజకీయ పార్టీ నాయకులను వారి వారి ఇళ్లకు ఆహ్వానించి తేనేటి విందు ఏర్పాటు చేశారు.



వెంకటాపురం(ఎం): పాలంపేటలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వెంకటాపురం(కె): శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు

విధుల్లో చేరిన సీఐ, ఎస్సైలు



సీఐ శ్రీనివాస్



ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: ఏటూరునాగారం సీఐగా మండల రాజు పనిచేస్తూ బదిలీ కాగా అనుముల శ్రీనివాస్‌ను సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో ఆయన సోమవారం విధుల్లో చేరారు. అలాగే ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ పేరూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా తాజొద్దీన్‌ను ఏటూరునాగారం ఎస్సైగా నియమించారు. ఈ మేరకు తాజొద్దీన్ విధుల్లో చేరారు. వీరిని సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

సీఐని కలిసిన నాయకులు



సన్మానిస్తున్న నాయకులు

సీఐగా బాధ్యతలను చేపట్టిన శ్రీనివాస్‌ను ఏటూరునాగారం మాజీ సర్పంచ్ చేల లక్ష్మివినయ్, పీఏసీఎస్ డైరెక్టర్లు వంగపండు రవి యాదవ్, సింగిరెడ్డి శ్రీరాములు సోమవారం మర్యాదపూర్వకంగా సీఐ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి స్వాగతం పలికారు. అలాగే ఈ బదిలీపై వెళ్తున్న సీఐ మండల రాజుకు శాలువా కప్పి సన్మానించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై వెంకటేశ్వర్లు

ములుగు: ములుగు ఎస్సై(ఎస్‌హెచ్‌ఓ)గా వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్థానంలో ఉన్న వెంకటేశ్వర్ ఏఆర్ అటాచ్‌గా వెళ్లారు. కాగా, బాధ్యతలు తీసుకున్న ఆయనకు స్టేషన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



వెంకటాపురం ఎస్సైగా సతీష్



ఎస్సై సతీశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): వెంకటాపురం నూతన ఎస్సైగా జక్కుల సతీశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై చల్లా రాజు వీఆర్‌కు బదిలీ కాగా, కొడిశాల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై సతీష్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సతీష్ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నేతలు ఎస్సై సతీష్‌కు బోకే అందించి శాలువాతో సత్కరించారు.

బాధ్యతల స్వీకరణ



వాజేడు: ఎస్సైగా రుద్రారపు హరీష్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఎస్సైగా పనిచేసిన సీహెచ్ వెంకటేశ్వరరావు ములుగుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ములుగు వీఆర్‌లో పని చేస్తున్న రుద్రారపు హరీష్‌ను నియమించగా సోమవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎస్సై హరీష్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతి భద్రతలను కాపాడటంలో ముందుంటానన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల ఉత్సవ మూర్తులు



కల్యాణానికి హాజరైన భక్తులు

మంగపేట: మండలంలోని బోరునర్సాపురంలోని శ్రీ సంతోషిమాత సహిత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అర్చకుడు కొయ్యడ శివరామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోరనర్సాపురం, మంగపేట, చెరుపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు వందల సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి వచ్చిన భక్తులకు మహా అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం కల్యాణం జరిపించిన దేవతా మూర్తులకు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ నిర్వాహకులు భక్తులు పాల్గొన్నారు.

మండల ప్రజల సహకారం మరువలేనిది



ఎస్సై రాజును సన్మానిస్తున్న పాత్రికేయులు

వెంకటాపురం(ఎం): మండల ప్రజల సహకారం మరువలేనిదని ఎస్సై చల్లా రాజు అన్నారు. మండలంలో దాదాపు తొమ్మిది నెలలు విధులు నిర్వహించి బదిలీ వెళ్తున్న ఆయన పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధుల సహకారంతో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా ముగిసాయన్నారు. వృత్తిరీత్యా బదిలీలు సహజమని, ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందడం గొప్ప అనుభూతి అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై చల్లా రాజును కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మిల్కూరి అయిలయ్య, మండల నాయకులు జంగిలి రవి, చెన్నోజు శ్రీనివాస్, కూరెళ్ల రామాచారి, మామిడిశెట్టి స్వామి, చీకూర్తి రమేష్, భూస సాంబయ్య, జాకీర్, వెంకటేష్, కోటి తదితరులు శాలువాలతో సన్మానించారు. రామప్ప జర్నలిస్టు సొసైటీ అధ్యక్షుడు బేతి సతీష్ ఆధ్వర్యంలో మండల పాత్రికేయులు కూడ ఎస్సైని శాలువాతో సత్కరించారు.

విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలి

భూపాలపల్లి రూరల్: కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ.. ఈనెల 19న హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ఆవరణలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు జిల్లా నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్(టిఎస్) రాష్ట్ర కార్యదర్శి భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రేణుకుంట్ల కొమరయ్య మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు చెల్లించలేక బడుగు బలహీన వర్గాల వారి పిల్లలు ఉన్నత చదువులకు దూరమతున్నారని పేర్కొన్నారు. పేద విద్యార్థుల ప్రయోజనం మేరకే ఈ సదస్సును నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఒంటెరు రవి, దేవుని స్వామి, పసుల కుమార్, మంద ప్రభాకర్ పారినంది సమ్మయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం అందించాలి

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు సూరారం, అంబట్‌పల్లి గ్రామాల్లో మావోయిస్టుల ఫొటోలు, పేర్లతో కూడిన ఫ్లెక్సీలను ఆయా గ్రామాల్లో ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం అంటించారు. గ్రామాల్లోని చౌరాస్తా, జనం తిరిగే చోట 'మావోయిస్టుల సమాచారం మాకు-బహుమతి మీకు' అనే ఫ్లెక్సీలను అంటించి వారిపై ఉన్న రివార్డులను తెలియజేశారు. మావోయిస్టుల సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న అయిలయ్య

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.20లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మిల్కూరి అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ.. మంత్రి సీతక్క నేతృత్వంలో జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, జంగిలి రవి, మామిడిశెట్టి స్వామి, కొంపెల్లి రాజిరెడ్డి, కొడారి చేరాలు, సాంబయ్య పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

టేకుమట్ల: మండలంలోని వెలిశాలలో ఆదివారం సాయంత్రం కురిసిన గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ వర్షానికి గ్రామానికి చెందిన బోయిని బక్కయ్య ఇంటిపై రేకులు ధ్వంసమయ్యాయి. పలు చోట్ల చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరి కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

భూములకు పట్టాలు ఇప్పించండి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

ములుగు: 60 సంవత్సరాలుగా సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇప్పించాలని ములుగు మండలం పత్తిపల్లి గ్రామ పంచాయతీ పరిధి కొడిశలకుంట గ్రామానికి చెందిన రైతులు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్కను కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 948, 949, 950లో బాలామన్-రాదామన్ పేరుపై ఉన్న పట్టా భూమిలో తాతల కాలం నుంచి చెట్లను తొలగించి సాగుకు ఆమోదయోగ్యంగా మార్చుకున్నామని అన్నారు. 2016వ వరకు రెవెన్యూ రికార్డుల ద్వారా పహణీలు తీసుకున్నామని, వాటి ఆధారంగా బ్యాంకు నుంచి వ్యవసాయ రుణాలు సైతం తీసుకున్నామని వివరించారు. ధరణి వచ్చినప్పటి నుంచి పహణీలు రావడం లేదని, తీసుకున్న రుణాలు రెన్యూవల్ కాలేదని అన్నారు. దీంతో రుణబాకీ భారీగా పెరుగుతూ వస్తుందని వాపోయారు. స్పందించిన సీతక్క ఈ సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్‌కు సిఫారసు చేస్తామని అన్నారు. వినతిపత్రం అందించిన వారిలో మూడ్ పరితచ సర్వన్, ధంజీ, రాజు, సునీల్, పృధ్వీ, వెంకట్రాం, పల్లవి, దస్రు, సీతారాం, దివ్య, శ్రీదేవి, ప్రతాప్‌సింగ్, వెంకటస్వామిరెడ్డి, భద్రమ్మ, మంజీ, సీతారాంనాయక్, పద్మ, విజయ తదితరులు ఉన్నారు.

డెయిరీ ఫాం కేటాయించాలి

పత్తిపల్లి, కొడిశలకుంట గ్రామానికి చెందిన మహిళా స్వయం సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించడానికి డెయిరీ ఫాం మంజూరు చేయాలని మంత్రి సీతక్కకు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. దివ్య మహిళా సంఘం, లక్ష్మీ మహిళా సంఘం, కావ్య మహిళ సంఘం, సుభాష్ మహిళ సంఘం, నవ్యశ్రీ మహిళా సంఘాల్లో మొత్తం 50 మంది ఎస్టీ మహిళలు ఉన్నామని మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి వినతిపత్రాన్ని డీఆర్‌డీఏకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో రాజమ్మ, పద్మ, మాలతి, భద్రమ్మ, వీరమ్మ, సువాలమ్మా, దివ్య, పద్మ, జ్యోతి, మంగమ్మ, సింధల్, శారద, సరిత, వినోద, సుమలతతో పాటు తదితరులు ఉన్నారు.

సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ప్రజావాణి



వెంకటాపురం(కె): ఫిర్యాదు స్వీకరిస్తున్న ఏఈ



వెంకటాపురం(ఎం)లో..

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణంలో సోమవారం విద్యుత్ దారుల సమస్యలపై విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరిచారు. తక్షణం పరిష్కరామయ్యే సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ సునీల్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(ఎం): మండల వ్యాప్తంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెంకటాపురం ట్రాన్స్‌కో ఏఈఈ సురేష్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారం రోజుల్లోగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ సాంబరాజు, లైన్ ఇన్‌స్పెక్టర్లు ఉదయ్‌భాస్కర్, సమ్మిరెడ్డి, లైన్‌మెన్ వేణు, జేఎల్ఎం రాజు పాల్గొన్నారు.

పశువుల మందకు డిమాండ్!

- గొర్రెలు, మేకలను పొలాల్లో నిలువుకునేందుకు రైతుల ఆసక్తి



జగ్గయ్యపేట గ్రామంలోని పొలంలో గొర్రెల మంద

రేగొండ: రైతులు వానాకాలం పనులకు సన్నద్ధం అవుతున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పంట భూమాలను సారవంతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. సేంద్రియ ఎరువులు చల్లడం, దుక్కులు దున్నడం వంటి పనులపై రైతులు దృష్టి సారించారు. పొలాల్లో గొర్రెలు, మేకలు పెట్టుకోవడం లేదా వాటి పేడను పొలాల్లోకి తరలిస్తున్నారు. పశువులు తక్కువ సంఖ్యలో ఉండటంతో వాటి పేడ లభించక డిమాండ్ పెరుగుతోంది. పశువుల సంఖ్య తగ్గిపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురవుతుందని రైతులు అంటున్నారు. ఒకప్పుడు ప్రతి రైతుకు ఎడ్లు, పాడి గేదెలు ఉండేవి. వీటి పేడను పొలాల్లో చల్లుకునేవారు. పొలాల్లో వేసవిలో తాత్కలికంగా పశువుల పాకలను ఏర్పాటు చేసేవారు. భూమిలో పోషకాలు పెరగడంతో రసాయన ఎరువుల వాడకం తక్కువగా ఉండేది. తద్వారా పంట దిగుబడి అధికంగా వచ్చేది. కొన్నేళ్లుగా సాగు విస్తీర్ణం పెరిగిపోయి, బీడు భూములు తగ్గిపోయాయి. పదుల సంఖ్యలో ఉన్న పశువులను కాపాడుకోవడం గగనమైంది. దీంతో వాటి సంఖ్యను రైతులు తగ్గించుకుంటూ వచ్చారు.

పశువుల ఎరువుకు డిమాండ్

పొలాల్లో సేంద్రీయ ఎరువు సాంద్రత తగ్గిపోవటంతో పంట దిగుబడి తగ్గిపోయింది. ఈ క్రమంలో భూముల్లో సూక్ష్మపోషకాలు పెంపొందించుకోవడానికి రైతులు పాత పద్ధతులు అవలంభిస్తున్నారు. పొలాల్లో గొర్రెల, మేకల మందకు డిమాండ్ పెరిగిపోయింది. ఒక రాత్రికి రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలు తీసుకుంటున్నారు. పశువుల పేడ, వండ్రు మట్టి, పెంట కుప్పలను పొలాల్లోకి తరలించి కలియ దున్నడం వలన భూములకు ఎంతో ప్రయోజనం చేకురుతుందని, సేంద్రీయ ఎరువుల వినియోగంతో పోషకాలు పెరిగి మొక్కలు బలంగా ఎదగడం వల్ల తెగుళ్ల బెడద తగ్గుతుందని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

భూమికి ఎంతో మేలు



పశువుల పేడను భూమిలో ఎరువుగా చల్లడం వలన మొక్కలు బలంగా పెరుగుతాయి. గొర్రెలు, మేకల మందను భూమిలో నిలపడం వలన భూమిలో అదనంగా మొక్కకు కావాల్సిన పోషకాలు లభిస్తాయి. పురుగుల బెడద తక్కువగా ఉండటంతో పాటు అధిక దిగుబడి పొందడానికి అవకాశం ఉంటుంది.

- గాదె శివరావు, జగ్గయ్యపేట

పేడ దొరకడం లేదు



గతంలో రైతుల దగ్గర పదుల సంఖ్యలో పశువులు ఉండేవి. రానురాను వాటి పోషణ భారం అవటంతో తగ్గించుకుంటూ వచ్చారు. దీంతో పశువుల పేడ దొరకని పరిస్థితి. దీంతో పొలాల్లో గొర్రెలు, మేకల మందను పెట్టుకోవడం జరుగుతుంది. మందలో భూములకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

- వన్నాల శివాజీ, కొత్తపల్లిగోరి

గుడి నిర్మాణానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న రజనీరాము దంపతులు

రేగొండ: మండలంలోని భాగిర్థిపేట, దుంపిల్లపల్లి గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ తల్లి గుడి నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన బోళ్ల రజినీరాము దంపతులు రూ.2,50,000 విరాళంగా అందజేశారు. తన తండ్రి బోళ్ల లోకెందర్ జ్ఞాపకార్థం విరాళాన్ని అందించినట్లు రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు రాములు, తిరుపతి, భిక్షపతి, శ్రీను, సంతోష్, రాజు, శంకరయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.